10 YEAR ANNIVERSARY 2014 - 2024

# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

గురువారం | 12 డిసెంబర్ 2024 | పేజీలు 8



డిసిపి కోటిరెడ్డి సూరారాం పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమీక్ష సమావేశం..

## సూరారం పియస్‌ను సందర్శించిన.. మేడ్చల్ డిసిపి..

### స్టేషన్ పనితీరును పరిశీలించి.. సిబ్బందితో మాట్లాడిన డిసిపి కోటిరెడ్డి..



మేడ్చల్ డిసిపి కోటిరెడ్డికి స్వాగతం పలుకుతున్న సూరారం ఇన్‌స్పెక్టర్ ఎస్.భరత్ కుమార్..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, డిసెంబర్ 11:** మేడ్చల్ డిసిపి ఎన్.కోటి రెడ్డి బుధవారం సూరారం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు.. ఎసిపి బి.శ్రీనివాస్ రెడ్డి స్టేషన్ ఎస్‌హెచ్‌వో భరత్ కుమార్, ఎస్సైలు, అన్ని దర్యాప్తు అధికారులు, సిబ్బందితో డిసిపి ఇంటరాక్ట్ అయ్యారు.. స్టేషన్‌లోని పలు కేసుల గురించి అడిగి తెలుసుకున్న ఆయన ప్రతిఒక్క విచారణ అధికారులను (ఐఓ)ల వారీగా కేసుల పురోగతిపై చర్చించారు.. ఐఓల వారీగా కేసులను నిర్ణీత సమయం లోపల ఖరారు చేయాలని ఆదేశించారు.. కేసులను ఎప్పటికప్పుడు త్వరితగతిన విచారణ జరిపించి పరిష్కారం చూపాలని సూచించారు.. పోలీస్ స్టేషన్ పనితీరును, పోలీసు స్టేషన్ వాతావరణం, పియస్ ప్రాంగణంలో పరిశీలించారు.. సూరారం పోలీస్ స్టేషన్ సిబ్బంది కవాతును డిసిపి కోటిరెడ్డి, ఏసిపి శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఏసీపీ బి.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.భరత్‌కుమార్ ఎస్‌హెచ్‌వో, సిహెచ్ వెంకటేష్ ఎస్ఐపి బి.సతీష్ డిఐ, అడ్మిన్, ఎ.కృష్ణ, ఎస్ఐపి, జి.కుమార స్వామి, సూరారం పోలీస్ సిబ్బంది, సిబ్బంది పాల్గొన్నారు

## తెలంగాణ సచివాలయంలో ఈ రోజు నుంచి ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ విధానం

- ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ శాంతికుమారి
- అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి వర్తిస్తుందని వెల్లడి
- వేతనాలు పొందే ప్రతి ఉద్యోగికీ వర్తిస్తుందన్న సీఎస్



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ సచివాలయంలో ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ విధానాన్ని అమలు చేయనున్నారు. డిసెంబరు 12వ తేదీ నుంచి రాష్ట్ర సచివాలయంలో ఈ నిబంధన అమలు చేయనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

సచివాలయంలో పని చేసే అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి ఈ ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ విధానం వర్తిస్తుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఔట్ సోర్సింగ్, సచివాలయం హెడ్ నుంచి వేతనాలు పొందే ప్రతి ఉద్యోగికి వర్తిస్తుందని స్పష్టం చేశారు.

## ఏసీబీ కస్టడీకి ఏఈఈ నిఖేష్ కుమార్



**హైదరాబాద్ పెన్ పవర్:**ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్ట్ అయిన ఇరిగేషన్ ఏఈఈ నిఖేష్ కుమార్‌ను ఏసీబీ కస్టడీకి అప్పగించింది కోర్టు. నాలుగు రోజుల పాటు కస్టడీకి అప్పగిస్తూ బుధవారం న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. జ్యుడిషియల్ రిమాండ్‌లో భాగంగా ప్రస్తుతం చర్లపల్లి జైల్లో ఉన్న నిఖేష్ కుమార్‌ను ఏసీబీ అధికారులు గురువారం (డిసెంబర్ 12) కస్టడీలోకి తీసుకోనున్నారు. కాగా, హైదరాబాద్‌లో ఇరిగేషన్ డిపార్ట్మెంట్‌లో పని చేస్తోన్న నిఖేష్ కుమార్ ఆదాయానికి మించి అక్రమ ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీకి ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ డిసెంబర్ 1వ తేదీన నిఖేష్ కుమార్ ఇంటితో పాటు అతడి కుటుంబ సభ్యులు, బంధువుల ఇండ్లలో ఏక కాలంలో సోదాలు నిర్వహించారు. -2 లో

## ప్రతిపక్షం ప్రతి దానిని రాజకీయం చేయాలని చూస్తోంది

- కేటీఆర్ వ్యాఖ్యలతోనే బీఆర్ఎస్ మానసికస్థితి ఏమిటో తెలుస్తోంది: మంత్రి శ్రీధర్ బాబు
- కేటీఆర్ ఆశల పల్లకిలో ఉన్నారని ఎద్దేవా
- అందుకే అధికారం వస్తుందని పగటి కలలు కంటున్నారని చురక

-2 లో





హైదరాబాద్ పెన్ పవర్:ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేల శిక్షణా తరగతులకు వెళ్లవద్దని కేటీఆర్ తన పార్టీ ఎమ్మెల్యేలకు పిలుపునిచ్చారని, దీంతో బీఆర్ఎస్ మానసిక స్థితి ఏమిటో తెలుస్తోందని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలకు ఈరోజు నుంచి ప్రభుత్వం శిక్షణా తరగతులను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో శ్రీధర్ బాబు ఓ టీవీ ఛానల్‌తో మాట్లాడుతూ... ప్రతిపక్షం ప్రతి దానిని రాజకీయం చేయాలని చూస్తోందన్నారు.కేటీఆర్ ఆశల పల్లకిలో ఉన్నారని, అందుకే నాలుగేళ్లలో అధికారం వస్తుందని పగటి కలలు కంటున్నారని విమర్శించారు.

## రాహుల్ గాంధీతో డిప్యూటీ సీఎం భట్టి భేటీ.!





హైదరాబాద్ పెన్ పవర్:ఢిల్లీలో రాహుల్ గాంధీని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కలిసినట్లు తెలుస్తోంది. ఏడాది పాలన, రాష్ట్ర రాజకీయాలు, మంత్రి వర్గ విస్తరణ, స్థానిక సంస్థల ఎన్నికలపై రాహుల్ తో భట్టి మాట్లాడినట్లు సమాచారం. రాజస్థాన్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి కూడా డిసెంబర్ 12న ఢిల్లీ రానున్నారు. ముఖ్యమంత్రి కూడా రాహుల్ తో పాటు పార్టీ పెద్దల్ని కలిసే అవకాశం ఉంది. అలాగే పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో రేవంత్ పలువురు కేంద్రమంత్రులను కలిసే అవకాశం ఉంది. తెలంగాణకు రావాల్సిన నిధులు,గ్రాంట్లు విడుదల చేయాలని కోరనున్నారు.

# హైదరాబాద్‌కి రానున్న రాష్ట్రపతి.. అప్రమత్తంగా ఉండాలన్న కలెక్టర్..

## వివిధ శాఖల అధికారులతో మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ సమీక్ష సమావేశం..






సమావేశంలో జిల్లా కలెక్టర్ గౌతమ్, అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి..

- శీతాకాలం విడిది నేపథ్యంలో ఈనెల 17న భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము హైదరాబాద్ రానున్నారు..
- 17వ తేదీన హకీంపేట ఎయిర్‌పోర్టుకి వచ్చి అక్కడ నుంచి బొల్లారం విడిది గృహానికి చేరుకుంటారు..
- రాష్ట్రపతి పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలి..
- రాష్ట్రపతికి ఆహ్వానం పలికేందుకు వివిపిలు వస్తారని అందుకు అవసరమైన ఏర్పాట్లు చూడాలి..
- మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, డిసెంబర్ 11:** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిది నేపథ్యంలో హైదరాబాద్ రానున్న దృష్ట్యా జిల్లాలోని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం పనికిరాదని మేడ్చల్ %-% మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం అన్నారు.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిది కోసం హైదరాబాద్ లోని బొల్లారంలో ఉన్న రాష్ట్రపతి నిలయానికి ఈనెల 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఉండనున్నందున అందుకు సంబంధించిన వివిధ ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారుతో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే రాష్ట్రపతి శీతాకాల విడిదికి ఈనెల 17వ తేదీన హకీంపేట ఎయిర్‌పోర్టుకి వచ్చి, అక్కడ నుంచి బొల్లారం విడిది గృహానికి చేరుకుంటారని.. అనంతరం 21వ తేదీ వరకు రాష్ట్రపతి నిలయంలో ఉంటారని వివరించారు.. రాష్ట్రపతి రానున్న సందర్భంగా సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా తమ విధులను నిర్వహించాలని తెలిపారు.

### సంబంధిత శాఖలు అప్రమత్తంగా ఉండాలి:కలెక్టర్..

రాష్ట్రపతి వస్తున్నందున ఈ విషయంలో ప్రతి ఒక్కరు తమకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహించాలని, అందుకు అనుగుణంగా ఎలాంటి ఇబ్బందులు, లోటుపాట్లు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో రాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.. రాష్ట్రపతికి ఆహ్వానం పలికేందుకు వివిపిలు వస్తారని అందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్నారు.. రోడ్లు ఎలాంటి గుంతలు, గతుకులు లేకుండా చూడాలని అందుకు అవసరమైన మరమ్మతులు చేపట్టి రోడ్లను బాగు చేయాలని దీంతో పాటు షామియానాలు (టెంట్లు), కుర్చీలు, వేదికకు సంబంధించిన అన్ని రకాల ఏర్పాట్లు చేయాల్సిందిగా రోడ్లు, భవనాల శాఖ అధికారికి సూచించారు.. ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అన్ని రకాల ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు... మున్సిపల్ అధికారులు సైతం ఎక్కడ కూడా చెత్త కనబడకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సంబంధిత కమిషనర్‌కి సూచించారు.. అలాగే విద్యుత్తు సరఫరాలో ఎలాంటి అంతరాయం

ఏర్పడకుండా ఉండేందుకుగాను అవసరమైన మరమ్మతులు, చర్యలు తీసుకొని నిరంతరాయంగా ఇరవై నాలుగు గంటల పాటు విద్యుత్తు సరఫరాను అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు కల్పించాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లారెవెన్యూ అధికారి హరిప్రియ, మల్కాజిగిరి, కీసర ఆర్డీఓలు శ్యాం ప్రకాష్, సైదులు, ఎసిపి రాములు, ఆయా శాఖల జిల్లా అధికారులు, పోలీసు, రెవెన్యూ, విద్యుత్తు శాఖల అధికారులు, తహాసీల్దార్లు, మున్సిపల్ కమీషనర్లు, తదితరులు పాల్గొన్నారు..

# ఏసీబీ కస్టడీకి ఏఈఈ నిఖేష్ కుమార్

- మొదటి పేజి తరువాయి

తనిఖీల సందర్భంగా కళ్ల బైర్లు కమ్మే రీతిలో ఏసీబీ అధికారులు ఆస్తులు గుర్తించారు. నిఖేష్ కుమార్ దాదాపు రూ.200 కోట్ల విలువ చేస్తే ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తించి అతడిని అరెస్ట్ చేశారు. అనంతరం ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయస్థానం 14 రోజుల పాటు జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. ఈ కేసుకు సంబంధించి నిఖేష్ కుమార్ నుండి మరిన్నీ వివరాలు రాబట్టాలని.. వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారు. పోలీసు అభ్యర్థనతో ఏకీభవించిన న్యాయస్థానం 4 రోజుల పాటు కస్టడీకి ఇచ్చేందుకు ఒప్పుకుంది. నిఖేష్ ను కస్టడీలోకి తీసుకోనున్న పోలీసులు అక్రమ ఆస్తులపై దర్యాప్తు చేయనున్నారు. కాగా, గండిపేట బఫర్ జోన్‌లో నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు మంజూరు చేశారని నిఖేష్‌పై పెద్ద ఎత్తున ఆరోపణలున్నాయి. నిఖేష్ పేరిట మూడు ఫామ్‌హౌస్‌లు, మూడు విల్లాలు.. మియాపూర్, శంషాబాద్, గచ్చిబౌలిలో ప్లాట్లతో పాటు .. మియాపూర్‌లో కమర్షియల్ కాంప్లెక్స్ ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ప్రస్తుతం నిఖేష్ సస్పెన్షన్‌లో ఉన్నారు.

# ప్రతిపక్షం ప్రతి దానిని రాజకీయం చేయాలని చూస్తోంది

- మొదటి పేజి తరువాయి

ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ విగ్రహాలను ఎవరూ తొలగించలేరన్నారు. ఎమ్మెల్యేల శిక్షణా తరగతులకు రావొద్దని కేటీఆర్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందా? అని ఎద్దేవా చేశారు. తెలంగాణ తల్లి విషయంలో కావాలని రాజకీయం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

# జీడిమెట్ల పియస్ పరిధిలో.. మహిళ దారుణ హత్య..!!

## గుర్తు తెలియని మహిళ(45)హత్యపై పోలీసుల దర్యాప్తు ముమ్మరం..

- కుత్బుల్లాపూర్ మున్సిపల్ చౌరస్తా సమీపంలోని ఫుట్‌పాత్‌పై మహిళ శవం లభ్యం..
- తలపై బండరాయితో కొట్టినట్లుగా ఉందని గుర్తించిన పోలీసులు..
- బిక్షాటన చేస్తున్న మహిళగా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు..

**ఇదిలా ఉండగా సంఘటన జరిగిన ప్రదేశం రోడ్డు పక్కన చౌరస్తా సమీపంలో వాహనాలు, పాద చారులతో రద్దీగా ఉండే ప్రదేశం అయినందున ఈ ప్రదేశానికి పక్కనే లారీలు, డ్రైవర్లు క్లీనర్లు ఇసుక వ్యాపారస్తులు జనసంచారంతో ఎప్పుడూ ఉంటారు.. మరోవైపు పక్కనే ఉన్న హెచ్ఎంటి జంగల్ ప్రదేశంలోగతంలో ఎన్నో హత్యలు ఆత్మహత్యలు జరిగిన విషయం తెలిసిందే. రాత్రి పగలు రద్దీగా ఉండే రోడ్డు, పోలీస్ స్టేషన్‌కి సమీపంలో ఉన్నప్పటికీ.. నేరం జరగడం స్థానికులు భయాందోళన చెందుతున్నారు..**

**పోలీస్ పెట్రోలింగ్ నిఘాను మరింత పెంచి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు..**



జీడిమెట్ల పియస్‌లో హత్యకు గురైన గుర్తు తెలియని మహిళ..



**జీడిమెట్ల, పెన్ పవర్, డిసెంబర్ 11:** జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధి, కుత్బుల్లాపూర్ మున్సిపల్ చౌరస్తా సమీపంలో దారుణ హత్యకు గురైన మహిళ శవం కలకలం రేపుతుంది.. ఈ హత్య వివరాలు చేదించేందుకు పోలీసులు తీవ్ర యత్నం చేస్తున్నారు..మరోవైపు ఇది హత్యా..? లేక అత్యాచారం హత్యా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.. లేక మరోచోట హత్య చేసి ఇక్కడ పడేశారా అనే విషయాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది..

**పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..**

జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ చౌరస్తాలో గల ఫుట్పాత్‌పై ఒక గుర్తుతెలియని 45 నుంచి 50 సంవత్సరాల వయసుగల మహిళ హత్యకు గురి కావడం స్థానికంగా కలకలం రేపుతోంది..మహిళను బండ రాయితో తలపై కొట్టినట్లుగా స్పష్టంగా అర్థమవుతుంది.. అక్కడే బండరాయి ఉండడం దానికి రక్తం మరకలు ఉండడం తర్వాత పక్కన పెట్టినట్లుగా తెలుస్తుంది.. మృతురాలి కుడిచేతి పైన పచ్చబొట్టు ఉందని, హిందూ మహిళగా అర్థమవుతుంది.. ఈమధ్యనే తను గుండు చేసుకున్నట్లుగా తెలుస్తుందని, తల వెంట్రుకలు చాలా చిన్నగా ఉండటాన్ని బట్టి భావిస్తున్నారు.. ఈ వివరాలతో న్యూస్ ప్రచురితమైతే..! చనిపోయిన మహిళను గుర్తించే అవకాశం ఉంటుంది సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు కొనసాగుతోంది. భిక్షం అడుక్కుంటూ అక్కడ రోడ్డుపైన ఉంటున్నట్టు తెలిసిందని పోలీసులు తెలియజేశారు..

# ఇంకోసారి రచ్చ చేయొద్దు..మంచు విష్ణుకు రాచకొండ సీపీ వార్నింగ్




**హైదరాబాద్ పెన్ పవర్:**రాచకొండ సీపీ కార్యాలయంలో మంచు విష్ణు విచారణ ముగిసింది. దాదాపు గంటన్నరసేపు విష్ణును సీపీ సుదీర్ బాబు విచారించారు. నాలుగు రోజులుగా మంచు కుటుంబ వివాదాలపై ఆరా తీసిన సీపీ .. మరోసారి శాంతిభద్రతలు విఘాతం కలిగేలా వ్యవహరించవద్దని విష్ణుకి వార్నింగ్ ఇచ్చారు. ఇంకోసారి ప్రైవేట్ సెక్యూరిటీ, బౌన్సర్లతో గొడవలకు పాల్పడవద్దని ఆదేశించారు. సమస్యలు ఉంటే ఇంట్లో పరిష్కరించుకోవాలి కానీ..గొడవలు చేయొద్దని సీపీ సున్నితంగా వార్నింగ్ ఇచ్చారు. ఇంటిదగ్గర ఎలాంటి ఇబ్బందులు ఉన్నా పోలీసులకు సమాచారం అందించాలని విష్ణుకి సూచించారు సీపీ. శాంతి భద్రతలు విఘాత కలిగించేలా వ్యవహరిస్తే లక్ష రూపాయల జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు సీపీ. విచారణ సందర్భంగా మనోజ్ ఫిర్యాదుపై కూడా విష్ణును విచారించినట్లు తెలుస్తోంది. జల్ పల్లిలోని ఫాంహౌస్ లో తన ప్రైవేట్ సెక్యూరిటీ ని పంపించాలని విష్ణును ఆదేశించారు సీపీ. జిల్లా అడిషనల్ మేజిస్ట్రేట్ హెూదాలో శాంతి భద్రతల పరిరక్షణ నిబంధనల బాండ్ పై సైన్ తీసుకున్నారు సీపీ సుధీర్ బాబు. 2024 డిసెంబర్ 11వ తేదీ ఉదయం 10.30 గంటలకు తమ ముందు హాజరు కావాలని రాచకొండ పోలీసులు ఆదేశించారు. పోలీసుల నోటీసులను హైకోర్టులో సవాల్ చేసిన.. మోహన్ డిసెంబర్ 24వ తేదీ వరకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు పొందారు. మరోవైపు సీపీ ఆదేశాల మేరకు మంచు మనోజ్ ఇవాళ (డిసెంబర్ 11) ఉదయం పోలీసుల విచారణకు హాజరయ్యారు. తమ ఫ్యామిలీలో జరుగుతోన్న పరిణామాలను సీపీకి వివరించారు. మరోసారి శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించనని సీపీకి రూ.లక్ష పూచికత్తుపై బాండ్ సమర్పించారు మనోజ్. పోలీసుల నోటీసులకు విష్ణు మాత్రం రెస్పాండ్ కాలేదు. అటు కోర్టును ఆశ్రయించలేదు.. ఇటు విచారణకు రాలేదు. దీంతో విష్ణుపై పోలీసులు సీరియస్ అయినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే డిసెంబర్ 11న రాత్రి మంచు విష్ణు సీపీ సుధీర్ బాబు ఎదుట విచారణకు హాజరయ్యారు.

### కుటుంబం ఆత్మహత్యాయత్నం

# ముగ్గురు మృతి.. ఒకరి పరిస్థితి విషమం



**హైదరాబాద్ పెన్ పవర్:** మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం కాసిపేట గ్రామంలో ఒక కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. తండ్రి సముద్రాల మొండయ్య ( 60) భార్య శ్రీదేవి (50), కూతురు చిట్టి (30) వరంగల్ లోని ఎంజీఎం హాస్పిటల్ లో చికిత్స పొందుతూ ముగ్గురు మృతి చెందారు. కుమారుడు శివప్రసాద్( 26 ) ఆరోగ్య పరిస్థితి విషమంగా వుంది.

## 5.3 తీవ్రతతో భూప్రకంపనలు వచ్చినా మేడిగడ్డకు ఏమీ కాలేదు: వినోద్ కుమార్

**మేడారం కేంద్రంగా భూప్రకంపనలు వచ్చాయని గుర్తు చేసిన వినోద్ కుమార్**

**మేడిగడ్డ డ్యాం మిల్లీమీటర్ కూడా కదల్లేదని వ్యాఖ్య**

**మేడిగడ్డ బలంగా ఉందా? అని 'సృష్టి' పరీక్షించుకుందన్న వినోద్ కుమార్**



హైదరాబాద్ పెన్ పవర్:రిక్టర్ స్కేల్‌పై 5.3 తీవ్రతతో ప్రకంపనలు వచ్చినా మేడిగడ్డ ప్రాజెక్టుకు ఏమీ కాలేదని బీఆర్ఎస్ సీనియర్ నేత వినోద్ కుమార్ అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఇటీవల ములుగు కేంద్రంగా ప్రకంపనలు వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ నేతలు విమర్శలు చేస్తున్న మేడిగడ్డ బలంగా ఉందన్నారు. వేల టీఎంసీల నీరు అక్కడి నుంచి ప్రవహిస్తోందని అయినప్పటికీ డ్యాం మిల్లీమీటర్ కూడా కదల్లేదన్నారు.మేడిగడ్డ ప్రాజెక్టు బలంగా ఉందా? లేదా? అని ఆ సృష్టే తెలుసుకున్నట్లుగా అయిందని వ్యాఖ్యానించారు. భూకంప కేంద్రమే మేడారం, మేడిగడ్డ అటవీ ప్రాంతంలో ఉందన్నారు. కేసీఆర్‌ను బద్నాం చేయడానికి మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిందని కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.నేషనల్ డ్యాం సేఫ్టీ, ఇతర కారణాలు చెప్పి వాయిదా వేయకుండా... ఫిబ్రవరి, మార్చి నాటికి అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టు ద్వారా నీరు ఇవ్వాలని కోరారు. మిడ్ మానేరు, ఎల్ఎండీని నింపి నీటిని వదిలితే పూర్వ కరీంనగర్, వరంగల్ జిల్లాలతో పాటు పలు జిల్లాలకు నీటిని ఇవ్వవచ్చన్నారు. మేడిగడ్డ బ్యారేజీపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు నిర్ణయం తీసుకోవడంలేదని ప్రశ్నించారు.

## 8వరోజు గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము "మీకోసం మీ వెనిగండ్ల"ఉదయపు పర్యటన

హైదరాబాద్ పెన్ పవర్:గుడివాడ మనది అన్న ఆలోచన ప్రతి ఒక్కరిలో రావాలని అప్పుడే స్వచ్ఛ గుడివాడ రూపకల్పన సాధ్యమవుతుందని ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. గుడివాడ పట్టణంలో పారిశుధ్య మెరుగుకు... ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నిర్వహిస్తున్న "మీకోసం మీ వెనిగండ్ల" ఉదయపు పర్యటనలు 8వ రోజుకు చేరుకున్నాయి. బుధవారం ఉదయం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనంపై పర్యటించిన ఎమ్మెల్యే రాము.. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలుచోట్ల త్రాగునీటి పైపుల లీకేజీలను గుర్తించిన ఎమ్మెల్యే రాము... వాటికి మరమ్మతులు నిర్వహించాలంటూ మున్సిపల్ అధికారులకు సూచించారు. పలు ప్రాంతాల్లో విధులు నిర్వహణలో ఉన్న పారిశుద్ధ్య కార్మికులతో ఎమ్మెల్యే రాము మాట్లాడారు... క్షేత్రస్థాయిలో శానిటేషన్ మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలను అడిగి తెలుసుకున్నారు.

# జర్నలిస్టుపై మోహన్ బాబు దాడి సరికాదు.. విచారణ జరిపి చర్యలు తీసుకుంటం: మంత్రి పొన్నం

హైదరాబాద్ పెన్ పవర్:కవరేజ్ కోసం వెళ్లిన జర్నలిస్టులపై ప్రముఖ నటుడు మోహన్ బాబు దాడి చేసిన విషయం తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు టాలీవుడ్‌లో ఈ వ్యవహారం దుమారం రేపుతోంది. జర్నలిస్టుల పట్ల అహంకార పూరితంగా వ్యవహరించిన మోహన్ బాబుపై చర్యలు తీసుకోవాలని పాత్రికేయులు, జర్నలిస్టు సంఘాలు పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో జర్నలిస్టులపై మోహన్ బాబు దాడి ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. ఈ మేరకు బుధవారం (డిసెంబర్ 11) ఆయన ఒక వీడియో విడుదల చేశారు.మోహన్ బాబు, మంచు మనోజ్ వ్యక్తిగత పంచాయతీలో జర్నలిస్టుపై దాడి సరికాదని అన్నారు. దాడి ఘటనపై విచారణ చేసి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కాగా, మంచు ఫ్యామిలీలో నెలకొన్న విభేదాలు గత నాలుగు రోజులుగా పీక్ స్టేజ్ కు చేరాయి. మంగళవారం (డిసెంబర్ 10) రాత్రి జల్ పల్లిలోని మోహన్ బాబు నివాసానికి ఆయన





కుమారుడు మంచు మనోజ్ వెళ్లడంతో ఉద్రిక్తలు మరింత ఎక్కువ అయ్యాయి. మనోజ్ ను ఇంట్లోకి రానివ్వకుండా గేట్స్ క్లోజ్ చేసి అడ్డుకున్నారు మోహన్ బాబు సెక్యూరిటీ సిబ్బంది. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన మనోజ్ గేట్లు తోసుకుని ఇంటి లోపలికి వెళ్లాడు. మోహన్ బాబు ఇంటి వద్ద జరుగుతోన్న ఈ ఫ్యామిలీ ఫైట్‌ను కవరేజ్ చేసేందుకు మీడియా అక్కడికి వెళ్లింది. మీడియా ప్రతినిధులు ఇంట్లోకి రావడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన మోహన్ బాబు.. కోపంలో జర్నలిస్టుపై దాడి చేశాడు. జర్నలిస్టు చేతిలో ఉన్న మైక్ ను తీసుకుని తలపై కొట్టాడు. ఈ ఘటనలో జర్నలిస్టు తీవ్రంగా గాయపడ్డాడు. అహంకార ధోరణితో జర్నలిస్ట్ పై దాడి చేసిన మోహన్ బాబుపై జర్నలిస్టు సంఘాలు భగ్గుమన్నాయి. మోహన్ బాబు మీడియాకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ బుధవారం (డిసెంబర్ 11) ఫిల్మ్ ఛాంబర్ ఎదుట ఆందోళన చేశారు.

# 'తెలంగాణ' హామీని కాంగ్రెస్ నిలబెట్టుకోలేకపోవడం వల్లే కేసీఆర్ ఉద్యమించారు: హరీశ్ రావు

**2009 లోపు తెలంగాణ ఇచ్చి ఉంటే కేసీఆర్ ఉద్యమం చేసి ఉండేవారు కాదన్న హరీశ్ రావు**

**2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ అధికారంలో ఉందన్న హరీశ్ రావు**

**నవంబర్ 29న కేసీఆర్ దీక్ష చేస్తేనే డిసెంబర్ 9 ప్రకటన వచ్చిందన్న మాజీ మంత్రి**





హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ ఇస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ 2004లో తమతో పొత్తు పెట్టుకుందని, కానీ హామీని నెరవేర్చకపోవడం వల్లే కేసీఆర్ ఉద్యమించాల్సి వచ్చిందని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. 2009లోపు తెలంగాణ రాష్ట్రం ఇచ్చి ఉంటే కేసీఆర్ ఉద్యమం చేసేవారు కాదన్నారు. సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 2004 నుంచి 2014 వరకు రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉందని గుర్తు చేశారు. కాంగ్రెస్ తెలంగాణ ఇస్తామన్న హామీని నెరవేర్చకపోవడంతో కేసీఆర్ నిరాహార దీక్షకు దిగారన్నారు. 2009 నవంబర్ 29న కేసీఆర్ దీక్ష చేయకుంటే కనుక డిసెంబర్ 9వ తేదీ నాటి ప్రకటనే ఉండేది కాదన్నారు. సోనియాగాంధీ దయతలిచి తెలంగాణ ఇచ్చారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎవరి భిక్ష వల్లనో తెలంగాణ రాలేదని... కేసీఆర్, తెలంగాణ ప్రజల పోరాటం వల్ల వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అప్పుడు ఏనాడైనా ఉద్యమంలో పాల్గొన్నాడా? అని ప్రశ్నించారు. తెలంగాణ కోసం ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజీనామా చేయాలని నాడు జేఏసీ చైర్మన్ పిలుపునిస్తే రేవంత్ రెడ్డి చేయలేదని విమర్శించారు. ఉద్యమంలో పాల్గొనని రేవంత్ రెడ్డి ఇప్పుడు తెలంగాణ చరిత్రను మార్చాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బీమా యోజన పథకం.. మహిళలకు ప్రతినెలా రూ. 7వేలు




**హైదరాబాద్ పెన్ పవర్:**మహిళలకు గుడ్ న్యూస్.. మహిళలకోసం కొత్త పథకం..ఇంట్లో ఉంటూనే ఆదాయం పొందే పథకం.. ఫుల్ టైం లేదా పార్ట్ టైం పనిచేస్తూ సంపాదించే పథకం.. ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు మహిళలకు ఇది ఎంతో ఉపయోగకరం..అదే ఎల్ ఐసీ బీమా సఖి యోజన పథకం.. ఈ పథకాన్ని ప్రధాని మోది డిసెంబర్ 09, 2024న హర్యానాలో మొదటగా ప్రారంభించారు. ఈ పథకం ద్వారా లబ్ది పొందాలంటే.. టెన్త్ పాసయితే చాలు. ఇంతకీ పథకం ఏంటిది.. ఈ పథకం ద్వారా ఎలా ఆదా యం వస్తుందో.. పూర్తి వివరాలు తెలుసుకుందాం..

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంగా ప్రభుత్వం %వా×జ% బీమా సఖీయోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం ద్వరా 10 వతరగతి పాసైన 18 నుంచి 70 యేళ్ల మధ్య మహిళలకు లైఫ్ ఇన్సూరెన్స్ ఇండియా ద్వారా మూడేళ్ల పాటు ఎల్ ఐసీ బీమా ఏజెంట్లుగా శిక్షణ ఇస్తారు. ఈ పథకంలో మహిళలను బీమా సఖీ అని పిలుస్తారు. ఈ మూడేళ్ల కాలంలో నెలకు కొంత డబ్బు చెల్లిస్తారు. మహిళలు వారి ప్రాంతాల్లో ఎల్ఐసీ ఏజెంట్లు పనిచేయాల్సి ఉంటుంది.

**బీమా సఖి యోజన పథకం ప్రయోజనాలు**

IC బీమా సఖి (MCA స్కీమ్) కింద ఎంపికైన మహిళలకు మూడేళ్ల శిక్షణలో మొత్తం రూ.2 లక్షలకు పైగా లభిస్తుంది. ఇందులో మొదటి ఏడాది నెలకు రూ.7 వేలు, రెండో ఏడాది రూ.6 వేలు, మూడో ఏడాది రూ.5 వేలు అందుతాయి. ఇందులో బోనస్ కమీషన్లు ఉండవు. దీని కోసం మహిళలకు విక్రయించే పాలసీలలో 65 శాతం వచ్చే ఏడాది చివరి వరకు యాక్టివ్‌గా (ఇన్-ఫోర్స్) ఉండాలనే షరతు ఉంటుంది.

ALSO READ | ప్రభుత్వ ఉద్యోగులకు బౌద్ధంలోకి నో ఎంట్రీ.. బౌద్ధం స్వీకరించే వారు చేయాల్సినవి ఇవి..

బీమా సఖీ పథకం కింద మూడేళ్ల శిక్షణ తర్వాత మహిళలను ఎల్ఐసీ ఏజెంట్లుగా నియమిస్తారు. ఈ శిక్షణ కాలంలో మహిళలకు కొంత డబ్బు కూడా లభిస్తుంది. అదే సమయంలో, బీఏ పాస్ అయిన బీమా సఖీలు.. ఎల్ ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా అవకాశం పొందవచ్చు.

అంటే ఒక మహిళ మొదటి సంవత్సరంలో 100 పాలసీలను విక్రయించినట్లయితే, రెండవ సంవత్సరం చివరి నాటికి వీటిలో 65 పాలసీలు అమలులో ఉండాలి. ఏజెంట్లు పాలసీలను విక్రయించడమే కాకుండా వాటిని నిలుపుకోడానికి కూడా ప్రయత్నిస్తారని నిర్ధారించడం దీని లక్ష్యం.

బీమా సఖికి ఎలా దరఖాస్తు చేయాలంటే..

LIC అధికారిక వెబ్‌సైట్ https://licindia.in/test2ని వెట్ సైట్ లోకి వెళ్లాలి.

దిగువన కనిపించే బీమా సఖిపై క్లిక్ చేయాలి.

పేరు, పుట్టిన తేదీ, మొబైల్ నంబర్, ఇమెయిల్ ID , చిరునామా వంటి వివరాలను ఎంటర్ చేయాలి.

మీరు LIC ఇండియా ఏదైనా ఏజెంట్/డెవలప్‌మెంట్ ఆఫీసర్/ఉద్యోగి/మెడికల్ ఎగ్జామినర్‌కు సంబంధించినవారైతే, అదే సమాచారాన్ని అందించండి.

చివరగా క్యాప్చా కోడ్ ఎంటర్ చేసి Submit బటన్ పై క్లిక్ చేయాలి.

# జగిత్యాల పోలీసులకు హ్యాట్సాఫ్ : 2 వేల మందికి ఉద్యోగాలు ఇప్పించారు..!




**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రస్తుతం ఉద్యోగం దొరకడం అంటే అంత ఈజీ కాదు. ఉద్యోగాలు లేని ఎంతో మంది యువతీ యువకులు అవకాశాల కోసం రోజు సర్టిఫికెట్లు పట్టుకుని తిరుగుతున్నారు. ఎక్కడైనా చిన్న ఉద్యోగమైనా దొర్కపోతదా అని ఎదురుచూస్తున్నారు. అయితే అలాంటి వాళ్ల కోసం మన జగిత్యాల జిల్లా పోలీసులు మంచి అవకాశం కల్పించారు. జగిత్యాల జిల్లాలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ విషయంలో జగిత్యాల జిల్లా పోలీసులకు హ్యాట్సాప్ చెప్పాల్సిందే. 2 వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా మెగా జాబ్ మేళ నిర్వహించామన్నారు జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్. ఈ మెగా జాబ్ మేళాలో ఐటీ,నాన్ ఐటీ , బ్యాంకింగ్, ఫార్మసీ వంటి రంగాలకు చెందిన 50 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతి, యువకులు పాల్గొనగా కంపెనీలు పలువురిని ఎంపిక చేసుకున్నాయి. ఎంతో మంది యువత ఉద్యోగాలు లేకా ఇబ్బంది పడుతున్నారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు. ఉద్యోగం ఎక్కడ వచ్చినా వెళ్లి జాయిన్ కావాలని తరువాత గ్రోత్ అదే వస్తుందని చూచించారు. జాబ్ మేళాకు ఐటీ, నాన్ ఐటీ, మార్కెటింగ్, సేల్స్ అండ్ సర్వీసెస్, బ్యాంకింగ్, ఫార్మసీ వంటి కంపెనీలు వచ్చాయని చెప్పారు ఎస్పీ.

## వరుస ఫుడ్ పాయిజన్ ఘటనల వెనక బీఆర్ఎస్ కుట్ర: బంద్రు శోభారాణి



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలోని గురుకులాలు, హాస్టల్స్, స్కూళ్లలో జరుగుతోన్న వరుస ఫుడ్ పాయిజన్ ఘటనల వెనక బీఆర్ఎస్ నాయకుల కుట్ర దాగి ఉందని రాష్ట్ర మహిళా కార్పొరేషన్ సహకార అభివృద్ధి చైర్మన్ బంద్రు శోభారాణి అన్నారు. 2024, డిసెంబర్ 10వ తేదీన ఫుడ్ పాయిజన్ జరిగిన వికారాబాద్ జిల్లా తాండూర్ గిరిజన బాలికల హాస్టల్ ను బుధవారం (డిసెంబర్ 11) అధికారులతో కలిసి ఆమె సందర్శించారు.

ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ.. వరుస ఫుడ్ పాయిజన్ ఘటనల వెనక గురుకులాల మాజీ కార్యదర్శి, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పై అనుమానాలు ఉన్నాయని కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ రాజకీయ లబ్ధి కోసం స్కూల్ పిల్లల జీవితాలతో ఆడుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లల జీవితాలతో ఆడుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫుడ్ పాయిజన్ ఘటనలపై దర్యాప్తు జరుగుతోందని.. దోషులను కఠినంగా శిక్షిస్తామన్నారు.

ఎలాంటి ఆందోళన వద్దు: కలెక్టర్ ప్రతీక్ జైన్

ఫుడ్ పాయిజన్ ఘటనల నేపథ్యంలో హాస్టల్ విద్యార్థుల తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ ధైర్యం చెప్పారు. యావత్ జిల్లా యంత్రాంగం మొత్తం విద్యార్థుల ఆరోగ్యానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని తెలిపారు. వంటలు నిర్వహించే ఏజెన్సీ సిబ్బందిని మార్చడం కానీ.. లేదా ఉన్నవారికి ట్రైనింగ్ ఇచ్చే లాగా ఇచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. తాండూర్ ఒకటే కాదు జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రతి హాస్టల్లో తనిఖీలు నిర్వహించి నిర్విరామంగా సందర్శిస్తూ ఇలాంటి ఘటనలు మళ్ళీ జరగకుండా పట్టిష్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## హైదరాబాద్ సిటీలో పెట్రోల్ ట్యాంకులో మంటలు.. జస్ట్ మిస్.. లేకపోతే బీభత్సమే




**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ నాంపల్లిలోని ఏక్ మినార్ కూడలి వద్ద అగ్ని ప్రమాదం జరిగింది. ఏక్ మినార్ సర్కిల్ లో ఉన్న పెట్రోల్ బంక్ లో ఇంధనం నింపడానికి వచ్చిన ట్యాంకర్ లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇంధనం ధాటికి పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. మెయిన్ రోడ్డు పక్కనే బంక్ ఉండటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర భయందోళనకు గురై పరుగులు తీశారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుంది. ఫైరింజన్ల సహాయంతో ఎగిసిపడుతోన్న మంటలను అదుపులోకి తీసుకొచ్చారు సిబ్బంది. రోడ్డు పక్కనే బంక్ ఉండటంతో నాంపల్లి ఏరియాలో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. రంగంలోకి దిగిన ట్రాఫిక్ పోలీసులు వాహనాల రద్దీని క్లియర్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. పెట్రోల్ బంకులో అగ్ని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో పోలీసులు, బంక్ సిబ్బంది ఊపిరి పీల్చుకుంది. కాగా, ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# గ్రామస్థులంతా కలిసి ఘనంగా నిరుపేద యువతి పెళ్లి చేశారు



హైదరాబాద్ పెన్ పవర్:ఉరంటేనే కొండంత అండ అని నిరూపించారు గ్రామస్తులు.. నిరుపేద కుటుంబానికి చెందిన ఓయువతి పెళ్లికి సాయం చేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. అంతేకాదు ఊరంతా పెళ్లి పెద్దలుగా మారి దగ్గరుండి మరీ అంగంగ వైభవంగా పెళ్లి జరిపించి వధూవరులను సాగనంపారు. ఈ ఘటన జగిత్యాల జిల్లా రూరల్ మండలం అనంతారం గ్రామంలో జరిగింది. కూతురు పెళ్లి చేయలేని స్థితిలో ఉన్న తల్లిదండ్రులకు మేమున్నామంటూ అండగా నిలిచారు అనంతారం గ్రామస్థులు. గ్రామస్తులంతా కలిసి తోచినంత సాయాన్ని అందజేశారు. పెళ్లికి అవసరమయ్యే సామగ్రితో పాటు ఇతర ఖర్చులన్నీ గ్రామస్తులే భరించారు. గ్రామంలోని ఫోటోగ్రాఫర్, ఇతర నిర్వాహకులు సైతం ఉచితంగానే సామాగ్రి అందజేశారు. ఏర్పాట్లలో ఏ మాత్రం లోటు లేకుండా ఘనంగా యువతి వివాహం దగ్గరుండి జరిపించారు. గ్రామస్తుల సాయంపై యువతి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఇది ఇలా ఉండగా పేదింటి అమ్మాయి పెళ్లికి అండగా నిలిచిన గ్రామస్తులపై పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఆపదలో ఉన్న ఫ్యామిలీకి అండగా ఉండటం గొప్ప విషయమంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు.

# మోహన్ బాబు ఆరోగ్య పరిస్థితిపై హెల్త్ బులెటిన్ విడుదల

- ఒళ్లు నొప్పులు, ఆందోళన కారణాలతో ఆసుపత్రిలో చేరారన్న వైద్యులు
- ఎడమకంటి కింద గాయాలను గుర్తించినట్లు తెలిపిన వైద్యులు
- హృదయ స్పందనలోనూ హెచ్చుతగ్గులు ఉన్నాయని వెల్లడి



హైదరాబాద్ పెన్ పవర్:సినీ నటుడు మంచు మోహన్ బాబు ఆరోగ్య పరిస్థితిపై హెల్త్ బులెటిన్ విడుదలైంది. మోహన్ బాబు నిన్న గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆసుపత్రిలో చేరారు. ఈ నేపథ్యంలో ఈరోజు హెల్త్ బులెటిన్‌ను వైద్యులు విడుదల చేశారు. మోహన్ బాబు ఎడమకంటి కింద గాయాలు గుర్తించినట్లు వైద్యులు తెలిపారు.మోహన్ బాబు అధిక రక్తపోటుతో బాధపడుతున్నారని, హృదయ స్పందనలో హెచ్చుతగ్గులు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన వైద్య నిపుణుల పర్యవేక్షణలో ఉన్నట్లు వెల్లడించారు. ఆయన ఒళ్లు నొప్పులు, ఆందోళన వంటి కారణాలతో ఆసుపత్రిలో చేరినట్లు తెలిపారు. రెండు రోజులు ఆసుపత్రిలో ఉండాలన్నారు.మరోవైపు రాచకొండ సీపీ కార్యాలయానికి మంచు మనోజ్ వచ్చారు. మోహన్ బాబు లేఖ ద్వారా ఫిర్యాదు చేసిన నేపథ్యంలో పోలీసులు విచారణకు పిలిచారు. దీంతో ఈరోజు మధ్యాహ్నం విచారణకు హాజరయ్యారు. పోలీసులు ఆయనను విచారించారు.

# మూడేళ్లలో తెలంగాణలో 64 వేల డ్రైవింగ్ లైసెన్సులు రద్దు




హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ వ్యాప్తంగా గత మూడేండ్లలో 64,083 డ్రైవింగ్‌లైసెన్స్‌లను ఆర్టీఏ అధికారులు రద్దుచేశారు. 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి 31 వరకు 14 , 220, 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు 30, 638, 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు 19, 225 డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దయ్యాయి. తాజాగా, 2024 ఏప్రిల్ 1 నుంచి 2024 నవంబర్ 30 వరకు 10 వేల 113 లైసెన్స్ లను క్యాన్సిల్‌చేస్తూ రవాణా శాఖ అధికారులు నిర్ణయం తీసుకున్నారు.ప్రతి ఏటా రద్దయ్యే లైసెన్స్‌లలో 70 శాతం వరకు డ్రంక్ అండ్‌డ్రైవ్‌కేసులే ఉంటున్నాయని ఆర్టీఏ ఆఫీసర్లు చెప్తున్నారు. మందుతాగి మొదటిసారి పట్టుబడితే ఫైన్లతో సరిపెడ్తున్న అధికారులు, రెండోసారి, మూడోసారి పట్టుబడితే మాత్రం డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దు చేస్తున్నారు. కానీ టెక్నికల్ సమస్యలకు తోడు స్టాఫ్‌పై ఇతర పని ఒత్తిడి వల్ల డ్రైవింగ్ లైసెన్స్ ల క్యాన్సిల్ పై సత్వర నిర్ణయాలు తీసుకోలేకపోతు న్నామని రవాణా శాఖ అధికారులు చెప్తున్నారు. ఇకపై ప్రతి 6 నెలలు లేదంటే 3 నెలలకోసారి ఎప్పటికప్పుడు వచ్చిన సిఫారసుల ఆధారంగా డ్రైవింగ్ లైసెన్స్ లను రద్దు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

# హైదరాబాద్ లోనే బడా ఎగ్జిబిషన్.. నుమాయిష్ మళ్లీ వచ్చేస్తుంది..!








హైదరాబాద్ పెన్ పవర్:హైదరాబాదీలు ఎంతగానో ఎదురు చూసే నుమాయిష్ ఎగ్జిబిషన్ వచ్చేస్తోంది. ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగే ఈ బడా ఎగ్జిబిషన్ జనవరి 1, 2025 నుండి ప్రారంభం కానుంది. 46 రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఎగ్జిబిషన్ జనవరి 1 నుండి ఫిబ్రవరి 25, 2025 వరకు జరగనుంది. సుమారు 2వేలకు పైగా స్టాల్స్ తో నిర్వహించే ఈ ఎగ్జిబిషన్ ను లక్షల సంఖ్యలో జనం సందర్శనచనున్నారు.

**టికెట్ ధరలు, టైమింగ్స్:**

జనవరి 1, 2025 ప్రారంభం కానున్న నుమాయిష్ ఎగ్జిబిషన్ వీక్ డేస్ లో సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 10: 30 గంటల వరకు ఉండనుంది. వీకెండ్స్, హాలిడేస్ సమయాల్లో సాయంత్రం 4 గంటల నుండి 11 గంటల వరకు ఉండనుంది. టికెట్ ధరల విషయానికి వస్తే.. ఈ ఏడాది టికెట్ రూ. 50గా ఉండనున్నట్లు సమాచారం. గత సంవత్సరం రూ. 40గా ఉన్న టికెట్ ధరపై రూ. 10 పెంచినట్లు తెలిపారు నిర్వాహకులు.

**స్టాల్స్ :**


ఈ ఏడాదికి గాను స్టాల్స్ కోసం 2 వేల 500 అప్లికేషన్స్ వచ్చాయని.. వాటిలో 2వేల 200 స్టాల్స్ కేటాయించినట్లు ఎగ్జిబిషన్ సొసైటీ అధికారులు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ లో షాపింగ్ తో పాటు రిక్రియేషన్, రిలాక్సేషన్ వంటి ఏర్పాటు లక్షల మంది సందర్శకులను ఆకర్షించనున్నాయిని తెలిపారు. చిల్డ్రన్స్ డే, ఉమెన్స్ డే పేరిట మహిళలకు, పిల్లలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.ఎగ్జిబిషన్ కి వచ్చే సందర్శకుల భద్రత కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేశామని.. సీసీటీవీ కెమెరాలతో ప్రత్యేక పోలీస్ స్టేషన్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు పోలీసులు.

# నాన్న అంటే నాకు ప్రాణం..మా నాన్న దేవుడు

హైదరాబాద్ పెన్ పవర్:నాన్న అంటే నాకు ప్రాణం..మా నాన్న దేవుడు. మా నాన్న ను మా అన్న విష్ణు, వినయ్ ట్రాప్ చేశారని నటుడు మోహన్ బాబు కుమారుడు మంచి మనోజ్ అన్నారు. మా నాన్న దృష్టిలో నన్ను శత్రువు గా చిత్రీకరించారు. నేను నా భార్య కలిసి ఒక టాయ్స్ కంపెనీ పెట్టాము. వాటికి కూడా అడ్డంకులు సృష్టించారు. నా పై దాడులు చేశారు..మా నాన్న ముందే నన్ను కొట్టారు. నాకు సపోర్ట్ చేస్తున్న మా అమ్మ ను కూడా డైవర్ట్ చేశారు. మూడు రోజులు బయటకు వెళ్ళు, మనోజ్ కి సర్ధిచెప్తాం అని మా అమ్మను కూడా నమ్మించారు. మీడియా మిత్రులకు క్షమాపణలు చెబుతున్నా. మీడియాపై దాడి చేయడం బాధ కలిగించింది. నా భార్య, ఏడు నెలల కూతురి పేరు లాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు.

# ఎవరీ నికితా సింఘానియా..? ట్రెండింగ్‌లో యాక్సెంచర్ ఐటీ కంపెనీ.. !

**హైదరాబాద్ పెన్ పవర్:**భిన్నత్వంలో ఏకత్వం కలగలిసిన మన సమాజంలో అందరూ సమానమేనని చెబుతారు. ఎవరికీ వేధించే హ క్కు లేదని వాదిస్తారు. మరి ఆడ, మగ విషయంలో ఆ సమన్యాయాన్ని పాటిస్తున్నారా..! అంటే సందేహించాల్సిందే. దేశంలో ఎక్కడ తప్పు జరిగినా.. మగజాతిదే తప్పంటోంది ఈ సమాజం. గయ్యాళిలా మహిళా రోడ్డుపై ఓ యువకుడిని చితకబాదిన.. వాడు ఏదో ఒకటి వెధవ పని చేసుంటాడులే అంటారే తప్ప, అతన్ని కాపాడే ప్రయత్నం ఎవరూ చేయరు. ఇక భార్యాభర్తల కుటుంబ వివాదాల్లో గృహహింస చట్టాలు గురించి ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. గృహహింస చట్టాలు ఒక్క మహిళలకు మాత్రమే సెక్యూరిటీని కల్పిస్తాయి. మరి మగవాళ్ల సంగతేంటి..? తప్పు చేయకపోయినా మగజాతి చట్టం ముందు దోషిగా నిలబడాల్సిందేనా..? చట్టాలు అనుకూలంగా ఉన్నాయని మగవారి స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తూ వేధిస్తున్న వారికి ఎలాంటి శిక్షలు ఉండవా..? టెకీ అతుల్ సుభాష్ ఆత్మహత్యతో ఇలాంటి ప్రశ్నలు ఎన్నో తెరమీదకు వస్తున్నాయి. పెళ్లి, పిల్లలు అంటూ అందరిలా ఎన్నో కలలు కన్న టెకీ అతుల్ సుభాష్ జీవితం అర్ధాంతరంగా ముగిసిపోయింది. భార్య వేధింపులు.. పోలీసుల విచారణలు.. న్యాయస్థానాల తీర్పులు.. తనను కష్టాల సుడిగుండం నుండి బయటపడేయలేవు అనుకున్న టెకీ అర్ధాంతరంగా తనువు చాలించాడు. 24 పేజీల సూసైడ్ నోట్ రాసి మరీ ప్రాణాలు తీసుకున్నాడు. ఎవరీ అతుల్ సుభాష్..? ఏంటి ఈ కథ..?



### సింఘానియాతో వివాహం.. ఓ బిడ్డ

అందరిలా బెంగళూరులో ఐటీ ఉద్యోగం చేసుకుంటూ కాలం వెళ్లదీసే ఓ సాధారణ వ్యక్తి.. అతుల్ సుభాష్. అతనికి 2019లో నికితా సింఘానియాతో వివాహం జరిగింది. ఎడదన్నర తరువాత కుమార్తె ఇంటికొచ్చింది. అక్కడినుంచి అతని జీవితం తలకిందులైంది. భార్యాభర్తల మధ్య విబేధాలు రావడంతో ఆ జంట విడిపోయారు. కొన్నాళ్లకే అతుల్ సుభాష్‌పై మాజీ భార్య నికితా సింఘానియా తప్పుడు కేసులు బనాయించింది. అసహజ శృంగారం, కట్నం కోసం వేధించాడంటూ అనేక కేసులు పెట్టింది. పరిష్కారం కోసం కోట్లు డిమాండ్ చేసింది. అంత ఇచ్చుకునే స్తోమత అతనికి లేదు. నిజానిజాలేంటో తెలుసుకోవాల్సిన పోలీసులు.. ఆ ప్రయత్నమే చేయకుండా అతనిపై కేసులు పెట్టారు.

### 24 పేజీల సూసైడ్ నోట్

ఉద్యోగం చేయకపోతే జీవితాన్ని నెట్టుకు రావడం కష్టం.. ఇటు చూస్తే అనేక కేసులు.. వారానికో విచారణ.. వీటన్నిటి నుంచి బయటపడే మార్గమే అతనికి కనిపించలేదు. న్యాయస్థానం ముందు తన వాదన ఎన్ని సార్లు వినిపించుకున్నా చట్టంలో ఆ వెసులుబాటు లేదని గ్రహించి.. మానసికంగా కృంగిపోయి ప్రాణాలు తీసుకున్నాడు. అతకుముందు అతను తనకు జరిగిన ప్రతి అవమానాన్ని, ప్రతి అన్యాయాన్ని సమగ్రంగా 24 పేజీల లేఖలో ప్రస్తావించారు. అలాగే తన ఒంటిపై జస్టిస్ ఈజ్ డ్యూ (న్యాయం జరగాలి) అని ఒక పేపర్ అతికించుకున్నారు. ఈ స్థాయిలో అతను ప్రాణాలు తీసుకున్నాడంటే.. ఆ మహాతల్లి ఎంత వేధించిందో అర్థం చేసుకోవాలి.

### ట్రెండింగ్‌లో యాక్సెంచర్ ఎందుకు..?

మృతుడు అతుల్ మాజీ భార్య పని చేస్తున్న సంస్థే.. యాక్సెంచర్. నికితా సింఘానియా ఏఐ ఇంజినీరింగ్ కన్సల్టెంట్‌గా యాక్సెంచర్ ఐటీ కంపెనీలో పని చేస్తోంది. 2021లో ఆమె యాక్సెంచర్‌లో చేరింది. ఆమెను ఉద్యోగం నుంచి తొలగించాలని నెటిజెన్స్ డిమాండ్ చేస్తున్నారు. అతుల్ మరణానికి కారణమైన నికితా సింఘానియాను తక్షణమే ఉద్యోగం నుండి తొలగించాలని నెటిజన్లు ఐటీ కంపెనీ యాజమాన్యాన్ని కోరుతున్నారు. ఆమెను ఉద్యోగం నుంచి తొలగించడం ద్వారా చనిపోయిన టెక్కీకి కాసింతైనా న్యాయం జరుగుతుందని వారు యాక్సెంచర్ యాజమాన్యానికి సూచిస్తున్నారు. అయితే, ఈ విషయంపై కంపెనీ ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. బదులుగా యాజమాన్యం యాక్సెంచర్ %శ% (ట్విట్టర్) హ్యాండిల్ యాక్సెస్‌ని పరిమితం చేసింది.

# గూగుల్ 'ఇయర్ ఇన్ సెర్చ్ 2024' విడుదల... మొదటి స్థానంలో వినేశ్ ఫొగాట్... పవన్ కల్యాణ్ స్థానం ఎంతంటే?

- రెండోస్థానంలో బీహార్ సీఎం నితీశ్ కుమార్
- నాలుగో స్థానంలో టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా
- ఐదో స్థానంలో పవన్ కల్యాణ్... మోడల్ పూనం పాండేకు ఏడోస్థానం



**హైదరాబాద్ పెన్ పవర్:**రాజకీయ రంగంలోకి ప్రవేశించి తొలిసారే సత్తా చాటిన ప్రముఖ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ గురించి ఈ ఏడాది గూగుల్‌లో తెగ వెతికేశారట. ఈ మేరకు గూగుల్ 'ఇయర్ ఇన్ సెర్చ్ 2024' రిపోర్టు వెల్లడించింది. బీజేపీ నేత, ఇండియా రెజ్లింగ్ ఫెడరేషన్ అప్పటి చీఫ్ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా గతేడాది సహ ఒలింపియన్లు అయిన సాక్షి మాలిక్, బజరంగ్ పూనియాతో కలిసి ఫొగాట్ ఆందోళనకు దిగారు. ఈ ఏడాది జరిగిన పారిస్ ఒలింపిక్స్‌లో ఫొగట్ ఫైనల్‌కు చేరుకున్నా అధిక బరువు కారణంగా బౌట్ నుంచి వైదొలగాల్సి వచ్చింది. దీనిపై కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్‌లో ఫొగాట్ ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. పారిస్ నుంచి భారత్ చేరుకున్న తర్వాత ఆమె కాంగ్రెస్‌లో చేరి ఇటీవల జరిగిన ఎన్నికల్లో హర్యానా నుంచి బరిలోకి దిగారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడినప్పటికీ జులానా స్థానం నుంచి పోటీ చేసిన ఫొగాట్ మాత్రం విజయం సాధించారు. ఈ నేపథ్యంలో ఆమె గురించి తెలుసుకోవాలన్న ఉత్సుకతతో ఎక్కువమంది గూగుల్‌లో ఫొగాట్ గురించి సెర్చ్ చేశారు.

ఇక, గూగుల్‌లో అత్యధికమంది వెతికిన వారిలో బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ రెండోస్థానంలో ఉన్నారు. ఎన్నికలకు ముందు బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏతో నితీశ్ కుమార్ మళ్లీ చేతులు కలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆయన పార్టీ జేడీయూ 12 స్థానాలు సాధించి కేంద్రంలోని కూటమి ప్రభుత్వంలో కీలకంగా మారింది. ఆ తర్వాతి స్థానంలో లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్) చీఫ్ చిరాగ్ పాశ్వాన్ మూడో స్థానంలో నిలిచారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంలో చిరాగ్ పాశ్వాన్ ప్రస్తుతం కేంద్రమంత్రిగా ఉన్నారు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ సారథ్య బాధ్యతలు చేపట్టిన టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా నాలుగో స్థానంలో నిలిచాడు. జూన్‌లో జరిగిన టీ20 ప్రపంచకప్‌లో సౌతాఫ్రికాతో జరిగిన ఫైనల్‌లో పాండ్యా చివరి ఓవర్ వేసి భారత జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ఐదో స్థానంలో నిలిచారు. ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా శశాంక్ సింగ్ (క్రికెటర్), పూనం పాండే (మోడల్), రాధిక మర్చంట్ (వ్యాపారవేత్త), అభిషేక్ శర్మ (క్రికెటర్), లక్ష్య సేన్ (బ్యాడ్మింటన్ ఆటగాడు) ఉన్నారు.

## అయ్యప్ప స్వాముల అందోళన

**హైదరాబాద్ పెన్ పవర్:**
మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో అయ్యప్పస్వాములు ఆందోళనకు దిగారు. అయ్యప్పస్వామి దీక్షలో వున్న జర్నలిస్టు రంజీత్ పై దాడి చేసిన మోహన్ బాబును వెంటనే అరెస్ట్ చేయాలంటూ డిమాండ్ చేసారు.

## బీజేపీ నేతను దారుణంగా హతమార్చిన మావోయిస్టులు

**హైదరాబాద్ పెన్ పవర్:**పోలీస్ ఇన్ఫార్మర్ నెపంతో బిజెపి నాయకుడిని మావోయిస్టులు దారుణంగా హత్య చేసారు. బిజెపి నాయకుడు కుడియం మాడేను గొంతు కోసి హత్య చేసారు. బీజాపూర్ జిల్లా పర్సేఘడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమనపల్లి గ్రామంలో ఘటన జరిగింది. కుడియం మాడే గత కొంతకాలంగా పోలీస్ ఇన్ ఫార్మర్ గా వ్యవహరిస్తున్నాడని నేషనల్ పార్క్ ఏరియా కమిటీ పేరుతో మావోయిస్టులు లేఖ వదిలి వెళ్లారు.

## నల్గొండ లో జర్నలిస్టుల నిరసన

**హైదరాబాద్ పెన్ పవర్:** జర్నలిస్టులపై సినీ నటుడు మోహన్ బాబు చేసిన దాడిని నల్లగొండ ప్రెస్ క్లబ్ ఖండించింది. విధి నిర్వహణలో భాగంగా కవరేజీ కోసం వెళ్ళిన వారిపై మోహన్ బాబు పాశవికంగా దాడి చేయడంపై జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. తక్షణమే మోహన్ బాబుని అరెస్టు చేయాలని ఈ సందర్భంగా నల్లగొండ ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు డిమాండ్ చేశారు. నిన్న జర్నలిస్టుల పైన దాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా.. స్థానిక రామగిరి చౌరస్తా నుంచి నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్ వరకు నల్లగొండ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు భారీ ర్యాలీ తీశారు.

## ముత్యాలమ్మ విగ్రహ పునః ప్రతిష్ఠలో పాల్గొన్న మంత్రి పొన్నం



**హైదరాబాద్ పెన్ పవర్:** సికింద్రాబాద్ కుమ్మరిగూడ లో శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. అమ్మవారికి పార్టీ వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేసారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ , కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.
మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గతంలో సికింద్రాబాద్ ఆలయంలో జరిగిన సంఘటన దురదృష్టకరం. వెంటనే ప్రభుత్వం స్పందించి స్థానిక శాసన సభ్యుడి విజ్ఞప్తి మేరకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో విగ్రహ పునఃప్రతిష్ఠ చేయడం జరిగింది. అమ్మవారి ఆశీస్సులు అందజేసే విధంగా వేద పండితులతో పునఃప్రతిష్ఠ చేసుకొని దేవాదాయ శాఖ మంత్రి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించుకుంటున్నం . ఎక్కడైనా దేవాలయాలు ప్రార్థన మందిరాల పట్ల రాజకీయం మంచిది కాదు. ఆ ముత్యాలమ్మ వారికి రెండు చేతులు జోడించి ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయు ఆరోగ్యాలతో ఉండాలని ప్రార్థించా. దేవాలయాలను కాపాడుకోవాలి విద్రోహం జరిగినపుడు అందరం కలిసి ఎదుర్కోవాలి కానీ రాజకీయాలు తగదు. ప్రజల విశ్వాసం కాపాడేలా మా ప్రభుత్వం ముందుకు పోతుందని అన్నారు.

# మోహన్ బాబుకు బీపీ ఎక్కువ వుంది

**హైదరాబాద్ పెన్ పవర్:**
కాంటినెంటల్ ఆసుపత్రి వైద్యులు మోహన్ బాబు ఆరోగ్యంపై హెల్త్ బులిటెన్ విడుదల చేసారు. చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి,మోహన్ బాబు కు చికిత్స అందిస్తున్న డాక్టర్ జగదీష్, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ రఘువీర్ కార్డియాలజిస్ట్ సివిఎస్.మూర్తి మీడియాతో మాట్లాడారు.
డాక్టర్ గురు ఎన్ రెడ్డి మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం మోహన్ బాబు హాస్పటల్ రావడం జరిగింది. బిపి ఎక్కువగా ఉంది. నోప్పులు అధికంగా ఉన్నాయని హస్పటల్ లో చేరారు. మెడనోప్పి, కాళ్లు విపరీతంగా నోప్పులు ఉన్నాయన్నారు. కోన్ని గాయాలు ఉన్నాయి. కంటి కింద వాపుగా ఉంది. ఈ రోజు సిటీ స్కాన్ చేయడం జరుగుతుంది.

# మోహన్ బాబుపై మీడియా ఆగ్రహం

**హైదరాబాద్ పెన్ పవర్:**జర్నలిస్టులపై సినీ నటుడు మోహన్ బాబు దాడి చేసిన ఘటన ప్రస్తుతం సంచలనంగా మారింది. ఈ మేరకు ఫిలిం ఛాంబర్ ఎదుట సీనియర్ జర్నలిస్టులు దేవులపల్లి అమర్, అల్లం నారాయణ కలిసి భారీ ఎత్తున జర్నలిస్టులు నల్ల బ్యాడ్జిలు ధరించి అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ..జర్నలిస్టుపై దాడికి పాల్పడిన మోహన్ బాబుపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాకుండా, వెంటనే హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఇక మోహన్ బాబు జర్నలిస్టుపై ఓ ఉన్మాదిలా దాడి చేశారని ఫైర్ అయ్యారు. ఒక రౌడీలా రంజిత్పై హత్యాయత్నానికి పాల్పడ్డారని, ఘటన జరిగి గంటలు గడుస్తున్నా.. ఇప్పటి వరకు మోహన్ బాబు ఇంకా క్షమాపణలు చెప్పలేదని అన్నారు. వాళ్ల కుటుంబ సమస్య బజారున పడ్డాక, కేసులు నమోదయ్యాకే మీడియా జోక్యం చేసుకుందన్నారు. జర్నలిస్టుపై దాడి చేసిన ఘటనలో మోహన్ బాబును వెంటనే అరెస్ట్ చేయాలని అల్లం నారాయణ డిమాండ్ చేశారు.

# రూ.2.25 లక్షల గంజాయి పట్టి వేత

## రెండు కేసుల్లో 8.598 కేజీల గంజాయి స్వాధీనం

**హైదరాబాద్ పెన్ పవర్:** దుండిగల్ ప్రాంతంలోని ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు గంజాయి అమ్మకాలు జరుపుతున్నారనే సమాచారం మేరకు రంగారెడ్డి ఎస్టీఎఫ్ బి టీమ్ సీఐ సుబాష్ టీమ్ రెండు కేసుల్లో రూ. 2.25 లక్షల విలువ చేసే గంజాయిని మంగళవారం రాత్రి పట్టుకున్నారు. పోచంపల్లి ప్రాంతానికి చెందిన దీపక్ కుమార్, మహమ్మద్ షరిఫ్ ఇస్మాల్ అనే వ్యక్తులు గంజాయి అమ్మకాలు జరుపుతుండగా వారి వద్ద నుంచి 7.460 కేజీల గంజాయిని పట్టుకున్నారు. మేడ్చల్ చెక్పోస్టు వద్ద బీహర్కు చెందిన ముగ్గురు వ్యక్తులు గంజాయి అమ్మకాలు జరుపతుండగా1.138కేజీల గంజాయిని పట్టుకున్నారు. గంజాయి అమ్మకాలు జరుపుతూ పట్టుబ డిన వారిలో బీహర్కు చెందిన మిలాన్కుమార్, మనీష్ కుమార్, అఖిలేష్ కుమార్లు ఉన్నారు. గంజాయిని పట్టుకున్న టీమ్లో బిటిఐ బి టీమ్ సీఐ సుబాష్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, అఖిల్, కానిస్టేబుళ్లు సుధాకర్, రవి, మోహన్రావు, సుదీప్ రెడ్డి ఉన్నారు.

# మమ్మల్ని అతిగా ప్రేమించడమే మా నాన్న చేసిన తప్పు





**హైదరాబాద్ పెన్ పవర్:**మంచు ఫ్యామిలీ వివాదం మంగళవారం రాత్రి మరింత ముదిరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంచు విష్ణు తాజాగా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.
ఈ ప్రెస్మీట్లో మంచు విష్ణు మాట్లాడుతూ... "ప్రతి ఇంట్లో ఇలాంటి సమస్యలు ఉంటాయి కాబట్టి, ఈ విషయాన్ని పెద్దదిగా చేయడం తగదు. ఇది నా రిక్వెస్ట్. నిన్న జరిగిన దాడిలో నాన్నకు గాయాలయ్యాయి. కుటుంబ గొడవల కారణంగా మా అమ్మ ఆసుపత్రి పాలైంది. గేట్లు పగలగొట్టుకుని మరీ మనోజ్ లోపలికి వచ్చాడు. ఓ తండ్రిగా మనోజ్పై నాన్న తక్కువగానే రియాక్ట్ అయ్యారు.
మమ్మల్ని అతిగా ప్రేమించడమే మా నాన్న చేసిన తప్పు. మేము కలిసి మెలిసి ఉంటాం అనుకున్నా. కానీ, దురదృష్టవశాత్తు ఇలా జరిగింది. మేము మళ్లీ తిరిగి కలుస్తామని ఆశిస్తున్నా. నిన్న జరిగిన గొడవలో ఒక రిపోర్టర్కు గాయాలయ్యాయి. అది దురదృష్టకరం. మీడియా వారికి ఆయన నమస్కరిస్తూ వచ్చారు. కానీ, అలా జరిగిపోయింది. గాయపడిన రిపోర్టర్ ఫ్యామిలీ తో టచ్ లో ఉన్నాము. ఉద్దేశపూర్వకంగా మేము ఎవరిపై దాడి చేయలేదు. మా కంటే ముందు మీడియాకు పోలీసుల నోటీసులు లీక్ అవుతున్నాయి. ఇవాళ ఉదయం 9.30 గంటలకు నాకు పోలీసుల నోటీసులు వచ్చాయి. పోలీసు విచారణకు వెళ్లాల్సిన అవసరం నాకు లేదు. మాకు ఏం ప్రొటెక్షన్ ఇచ్చారు? కానీ, వ్యవస్థపై గౌరవం ఉంది కాబట్టి సీపీని కలుస్తాను. ప్రేమలో గెలవాల్సిన విషయాలపై రచ్చ పెట్టుకుంటే ఏది జరగదు. మనోజ్ ఆరోపణలపై నేను చెప్పేది ఏమీ లేదు. కడుపు చించుకుంటే కాళ్లమీద పడుద్ది. నేను నా కుటుంబ విషయాలు మాట్లాడను. నేను ఇక్కడ ఉంటే, ఫిర్యాదుల వరకు వెళ్లేది కాదు. నాన్న గారి ఆస్తి ఆయన ఇష్టం. ఎంతో కష్టపడి స్వయంకృషితో గొప్ప స్థాయికి ఎదిగారు. మాకు లభించే గౌరవం ఆయనవల్లే. కుటుంబం పరంగా నాన్న ఏది అనుకుంటే అదే ఉండాలి. తల్లిదండ్రులను గౌరవించడం పిల్లలుగా మా బాధ్యత. మీడియాలో కొంతమంది హద్దు మీరుతున్నారు. అందరూ కాదు. పబ్లిక్ ఫిగర్స్ పై రిపోర్ట్ చేయటం మీడియా బాధ్యత. కానీ సోసైటీలో కొందరు ఎందుకు ఓవరాక్షన్ చేస్తున్నారని కామెంట్స్ చేస్తున్నారు. ఇక వినయ్ నాకు అన్న లాంటి వారు. ఆయన ఎవరిపైనా చేయి చేసుకోలేదు. వినయ్ కు, నాకు 15 ఏళ్ల పరిచయం ఉంది. ఇండియాలోనే గొప్ప స్థాయిలో ఉన్న వ్యక్తి. తెలుగు రాష్ట్రాల్లో మోహన్ బాబు యూనివర్సిటీకి మంచి పేరు ఉంది. ఇండియాకు ఫారిన్ యూనివర్సిటీలను తీసుకువచ్చే ఘనత మాదే అవుతుంది. ఇప్పటికే ఆ వైపుగా చర్చలు జరుగుతున్నాయి. మోహన్ బాబు గారిని నమ్మి అక్కడ తమ పిల్లలను జాయిన్ చేస్తున్నారు. అది మాకు దేవాలయం. యూనివర్సిటీ జోలికి వస్తే ఊరుకునేది లేదు. ఇక మా అక్కకు, నాకు భేదాభిప్రాయాలు ఉన్నా.. ఆమె కొట్టినా తిట్టినా నేను పడతాను. ఎందుకంటే తను నా అక్క
మా కుటుంబంలో బయటి వ్యక్తుల ఇన్వాల్వ్మెంట్ ఉంటే వారికి ఈ సాయంత్రం వరకు సమయం ఇస్తున్నాము. లేదంటే అందరి పేర్లు నేనే బయటపెడతాను. మా నాన్న చెప్పిందే వేద వాక్కు. ఆయన చెప్పింది నేను చేస్తాను. కానీ నా తమ్ముడిపై నేనెప్పుడు దాడులు చేయను. నా సినిమా, మా అసోసియేషన్ గురించి తప్ప నేను ఏ విషయంలో మాట్లాడను. కానీ నాకు అవకాశం ఉంటే ఫిర్యాదులు, వాయిస్ మెసేజ్ కూడా బయటికి వచ్చేది కాదు. సమయమే అన్ని సమస్యలకు సమాధానం ఇస్తుంది. అమెరికా నుంచి ఇక్కడికి వచ్చే క్రమంలో నరకం చూశాను. మీ తల్లి మీకు ఫోన్ చేసి ఏడుస్తుంటే దాన్ని మించిన బాధ ఇంకేమైనా ఉంటుందా?" అని మంచు విష్ణు ఆవేదన వ్యక్తం చేశారు.

# మా అన్నవిష్ణు వల్లే ఇదంతా ..
# మా అమ్మ ఆస్పత్రిలో ఉందనేది అబద్ధం: మనోజ్




**హైదరాబాద్ పెన్ పవర్:**వినయ్ అనే వ్యక్తి విద్యానికేతన్ సంస్థల్లో అక్రమాలు చేస్తున్నారని..ఇదంతా తన తండ్రికి చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు మంచు మనోజ్ . రాచకొండ సీపీని కలిసి అనంతరం మనోజ్ మీడియాతో మాట్లాడాడు. తన అమ్మ ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారనేని అవాస్తవమన్నారు . తన అన్న విష్ణు ప్రోత్బలంతోనే ఇదంతా జరుగుతుందన్నారు మనోజ్.తాను ఫిర్యాదులో పేర్కొన్న విజయ్, కిరణ్ అనే వ్యక్తులని పోలీసులు పట్టుకుని దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు మనోజ్ . కూర్చొని సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవడానికి తాను సిద్ధమన్నారు మనోజ్.. పోలీస్ వ్యవస్థపై నమ్మకం ఉంది.. నాకు న్యాయం జరుగుతుందనే నమ్మకం కూడా ఉందన్నారు మంచు మనోజ్. ఇంటి దగ్గర ఎక్కువగా పబ్లిక్ ఉండకూడదని పోలీసులు సూచించారని తెలిపారు. సమస్య పరిష్కారం అయితే అందరికీ సంతోషమన్నారు మనోజ్ .చంద్రగిరి పెద ప్రజల కోసం నేను పోరాడుతున్నానని చెప్పారు మనోజ్.
మరో వైపు తెలంగాణ హైకోర్టులో మోహన్ బాబు, విష్ణులకు ఊరట లభించింది. పోలీసులు జారీ చేసిన నోటీసులపై స్టే విధించింది. డిసెంబర్ 11న విచారణకు హాజరుకావాలంటూ మోహన్ బాబుకు, విష్ణుకు,మనోజ్ కు రాచకొండ సీపీ నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. మనోజ్ సీపీ ముందు హాజరుకాగా.. నోటీసులపై మోహన్ బాబు హైకోర్టులోలంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు . ఈ పిటిషన్ విచారణ సందర్భంగా హైకోర్ట్ .. ఈ గొడవలు మోహన్ బాబు కుటుంబ వ్యవహారమని తెలిపింది . ప్రతి రెండు గంటలకు ఒకసారి మోహన్ బాబు ఇంటిని పర్యవేక్షించాలని పోలీసులను ఆదేశించింది హైకోర్టు.తదుపరి విచారణను డిసెంబర్ 24 కు వాయిదా వేసింది.